
సాక్షి ఒడిశా

మంగళవారం । 26 । మార్చి । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్‌: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.7,72,414లు, బంగారం 4 గ్రాముల 850 మిల్లీగ్రాములు, వెండి 79గ్రాములు 700 మిలీం ల్లగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



చెట్టును ఢీకొన్న వ్యాన్‌

మల్కన్‌గిరి జిల్లాలోని కలిమెల సమితి కంగుర్‌కొండ పెట్రోల్‌ బంక్‌ సమీపంలో ఒక వ్యాన్‌ చెట్టును ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందారు.

- 8లో

రంజాన్‌ వేళలు

ఇఫ్తార్‌	సెహరి
మంగళ	బుధ
6.05	4.31

న్యూస్‌రీల్‌

భారీగా గంజాయి సీజ్‌



స్వాధీనం చేసుకున్న గంజాయి

బరంపురం: గంజాం జిల్లాలో రోజురోజుకీ గంజాయి మాఫియా ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. నగరానికి సమీపంలోని 16వ నంబర్‌ జాతీయ రహదారిలో కారులో అక్రమంగా రవాణా అవుతున్న గంజాయిని ఎక్సైజ్‌ అధికారులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. బరంపురం నగరం మీదుగా ఆంధ్రప్రదేశ్‌ వైపు గంజాయి తరలిస్తున్నట్లు పోలీసులకు ముందస్తు సమాచారం వచ్చింది. దీంతో గొళంతరా పోలీసుస్టేషన్‌ పరిధి హల్దియాపదర్‌ జాతీయ రహదారిలో ఎక్సైజ్‌ అధికారి రమేంద్ర నారాయణ నాయక్‌ నేతృత్వంలో ఎక్సైజ్‌ బృందం ఒక కారుపై దాడిచేసి, రూ.కోటికి పైగా విలువచేసే గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అలాగే గంజాయి రవాణా చేస్తున్న ఆరుగురు నిందితులను అరెస్టు చేశారు.

గంజాయి పంట ధ్వంసం



గంజాయి పంట ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్‌ సిబ్బంది

జయపురం: సబ్‌ డివిజన్‌ పరిధి బొయిపరిగుడ సమితి మరిఖిగుడ పంచాయతీ టోటాపడ గ్రామ పరిసరాల్లో అక్రమంగా సాగు చేస్తున్న 33 ఎకరాల గంజాయి పంటను ఎక్సైజ్‌ సిబ్బంది సోమవారం ధ్వంసం చేశారు. టొటాపడ గ్రామ పరిసర ప్రాంతాల్లో గంజాయి పంట సాగు చేస్తున్నట్లు ఎక్సైజ్‌ విభాగానికి సమాచారం వచ్చింది. దీంతో కొరాపుట్‌ జిల్లా ఎక్సైజ్‌ ఎస్పీ అరుణ కుమార్‌ పాడీ దాడులు నిర్వహించమని ఆదేశాలు జారీ చేశారు. దీంతో నందపూర్‌ ఎక్సైజ్‌ ఇన్‌స్పెక్టర్‌ అన్నపూర్ణ రథ్‌, జయపురం రేంజ్‌ ఇన్‌స్పెక్టర్‌ శశికాంత దత్‌, బొయిపరిగుడ అధికారి భగవాన్‌ మహానందియ, జయపురం ఓబీసీ నీలాద్రి మిశ్ర తదితరులు దాడులు నిర్వహించారు. దీనిలో భాగంగా రూ.3.30 కోట్ల విలువచేసే 33 ఎకరాల్లో సాగు చేస్తున్న పంటను ధ్వంసం చేశారు. కార్యక్రమంలో బొయిపరిగుడ తహసీల్దార్‌ స్నిగ్ధరాణి యాదురి, బొయిపరిగుడ ఎక్సైజ్‌ ఏఎస్‌ఐ హలదర జాని తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే బాహిణీపతి ప్రచారం ప్రారంభం



బాహిణీపతికి స్వాగతం పలుకుతున్న ప్రజలు

జయపురం: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల కోసం జయపురం నియోజకవర్గంలో కాంగ్రెస్‌ సిట్టింగ్‌ ఎమ్మెల్యే తారాప్రసాద్‌ బాహిణీపతి ప్రచారాన్ని సోమవారం ప్రారంభించారు. దీనిలో భాగంగా బరిణిపుట్‌ పంచాయతీ ప్రజలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత రెండుసార్లు ప్రేమతో ఆదరించిన ప్రజలకు రుణపడి ఉంటానని తెలియజేశారు. మరోసారి అమూల్యమైన ఓటువేసి తనను గెలిపించాలని అభ్యర్థించారు. తాను ఎమ్మెల్యేగా పదేళ్లలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిన విషయం ప్రజలకు తెలిసిందేనన్నారు. అనంతరం ఓసీసీ కాలనీ, పద్మపూర్‌ గ్రామాల నుంచి పలువురు యువకులు, బెరసబ చర్చ పాస్టర్‌ సచిన్‌ నాగ్‌ తన అనుచరులతో కాంగ్రెస్‌లో చేరారు.

మూడు సింహం కూనలు జననం



నందన్‌ కాననలో జన్మించిన సింహం కూనలు

భువనేశ్వర్‌: నగర శివారులోని బారంగ్‌ నందన్‌ కానన్‌ జులాజికల్‌ పార్కులో 3 సింహం కూనలు జన్మించాయి. ఆసియా సింహం రేవా తన మొదటి ఈతలో మూడు పిల్లలకు జన్మనిచ్చింది. వీటి జననంతో సింహాల సంఖ్య 24కి చేరింది. జంతు వైద్య నిపుణుల ప్రత్యక్ష పర్యవేక్షణలో వాటిని సంరక్షణకు ఏర్పాట్లు చేశారు. కూనలపై తల్లి సంరక్షణ బాగోగులను సీసీ కెమెరాల్లో నిఘా వేస్తున్నారని పార్క్‌ డిప్యూటీ డైరెక్టర్‌ సనత్‌ కుమార్‌ తెలిపారు.

పోటీకి గుడ్‌ బై..!

- స్పష్టం చేసిన జట్నీ ఎమ్మెల్యే సురేష్‌ కుమార్‌
- తన కుమారులు రాజకీయ అరంగ్రేటం చేస్తారని వెల్లడి
- కాంగ్రెస్‌ విధేయుడిగానే ఉంటానని ప్రకటన



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సురేష్‌ కుమార్‌ రౌత్రాయ్‌

భువనేశ్వర్‌: రాష్ట్ర రాజకీయాల్లోని జట్నీ శాసనసభ నియోజకవర్గంలో సరికొత్త అభ్యర్థులు తెరపైకి వచ్చే అవకాశం ఉంది. ఈ నియోజకవర్గంలో బలమైన నాయకుడిగా విశేష ప్రజాదరణ పొందిన సిటింగ్‌ ఎమ్మెల్యే సురేష్‌ కుమార్‌ రౌత్రాయ్‌ ఇక నుంచి ఎన్నికల్లో పోటీకి గుడ్‌ బై చెప్పనున్నట్లు ప్రకటించారు. తన నిర్ణయంలో ఎటువంటి మార్పు ఉండబోదని స్పష్టం చేశారు. తన బదులుగా ఇద్దరు కొడుకులు రాజకీయ ఆరంగేట్రం చేస్తారని ప్రకటించారు. కాంగ్రెసుతో వెలుగులోకి వచ్చిన తాను చిరకాలం ఆ పార్టీ విధేయుడిగా ఉంటానని వెల్లడించారు. అయితే తండ్రి అడుగుజాడల్లో కొడుకులు కాంగ్రెసు అభ్యర్థులుగా, నవ తరం నాయకులుగా ఎదుగుతారని ఊహించిన ఆయన మాత్రం ప్రస్తుతం సందిగ్ధంలో పడ్డారు. ఆయన చిన్న కొడుకు మన్మథ రౌత్రాయ్‌ బిజూ జనతా దళ్‌ అభ్యర్థిగా రాజకీయ రంగ ప్రవేశం చేసేందుకు మక్కువ కనబరుస్తున్నారు. మన్మథ్‌ పోకడ అర్థం కావడం లేదని తండ్రి సురేష్‌ కుమార్‌ రౌత్రాయ్‌ ఆందోళన వ్యక్తం చేశారు. కొడుకుని ఒప్పించేందుకు శత విధాలా ప్రయత్నిస్తున్నట్లు సురేష్‌ కుమార్‌ రౌత్రాయ్‌ తెలిపారు. కాంగ్రెసు నుంచి పోటీ చేయాలని ప్రాధేయపడుతున్నానని వివరించారు. విచక్షణ కలిగిన కొడుకుని బలవంతంగా సంస్కరించడం సాధ్యం కాదన్నారు.

కాంగ్రెస్సే దేవాలయం

తనకు కాంగ్రెసు దేవాలయం, హస్తం గుర్తు భగవంతుడని సురేష్‌ కుమార్‌ పేర్కొన్నారు. ఇదే యోచనతో కొడుకు మన్మథ్‌ రౌత్రాయ్‌ కూడా కాంగ్రెసు పార్టీ కోసం హస్తం గుర్తుతో పోటీ చేయాలని మనసారా ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. తన అభ్యర్థనకు కొడుకు పట్టం గడతాడని చివరి క్షణం వరకు ఆశిస్తానని తెలిపారు. ఒకవేళ బీజేడీ టికెటుతో పోటీకి నిలబడితే మౌనంగా తాను దూరం అవుతానని ప్రకటించారు. చివరి క్షణంలో కాల ప్రభావం కోసం నిరీక్షిస్తున్నానన్నారు. తన అభిప్రాయం మారకుంటే బీజేడీ నుంచి పోటీ చేసినట్లయితే కొడుకు కోసం ఎటువంటి ప్రచారం చేసేది లేదని బహిరంగపరిచారు. తండ్రీ, కొడుకుల బంధం నేపథ్యంలో బీజేడీ కోసం పోటీ చేసిన పరిస్థితుల్లో కొడుకు కోసం అనుకూల లేదా ప్రతికూలంగా ప్రచారం చేయకుండా మౌనంగా దూరం అవుతానని స్పష్టం చేశారు.

సురేష్‌పై కాంగ్రెస్‌ ఆసక్తి

ఎన్నికల సన్యాసం ప్రకటించిన సిటింగ్‌ ఎమ్మెల్యే సురేష్‌ కుమార్‌ రౌత్రాయ్‌ని దూరం చేసుకునేందుకు రాష్ట్ర కాంగ్రెసు ఏమాత్రం ఇష్టపడడం లేదు. తన కొడుకు బదులుగా జట్నీ నియోజక వర్గం నుంచి తననే ప్రత్యక్షంగా పోటీ చేయమని రాష్ట్ర ప్రదేశ్‌ కాంగ్రెసు కమిటీ ఓపీసీసీ అభ్యర్థిస్తోంది. అయితే వయోభారం కారణంగా ఇక నుంచి ఎన్నికల్లో పోటీ చేయనని నిర్ణయించుకున్నట్లు సురేష్‌ కుమార్‌ పార్టీ అధిష్టానానికి సవినయంగా తెలియజేశారు.

బీజేపీలో రె‘బెల్‌’

- స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయనున్న ఖారబేల స్వంయి



మాట్లాడుతున్న ఖారబేల స్వంయి

భువనేశ్వర్‌: రాష్ట్రంలో ఎన్నికల వాతావరణం క్రమంగా వేడెక్కుతోంది. లోక్‌సభ స్థానాలకు భారతీయ జనతా పార్టీ అభ్యర్థుల తొలి జాబితా ఆదివారం ప్రకటించింది. 3 స్థానాలు మినహా మిగిలిన 18 స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసింది. అయితే ఈ జాబితా వెల్లడి కావడంతో బలాసోర్‌ పార్లమెంటరీ నియోజకవర్గంలో అసంతృప్తి వెల్లడైంది. ఈ నియోజకవర్గం నుంచి బీజేపీ టికెట్టు ఆశించిన ఐర ఖారబేల స్వంయికి చుక్కెదురు అయింది. బాలాసోర్‌ లోక్‌సభ స్థానం సిటింగ్‌ అభ్యర్థి ప్రతాప చంద్ర షడంగికి పార్టీ టికెట్టు కేటాయించింది. దీంతో ఐర ఖారబేల స్వంయి స్వతంత్ర అభ్యర్థిగా బాలాసోర్‌ పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి పోటీ చేయనున్నట్లు సోమవారం ప్రకటించారు.

మూడుసార్లు ఎంపీగా...

ఖారబేల స్వంయి ఈ నియోజకవర్గం నుంచి 3 సార్లు ఎంపీగా ఎన్నికయ్యారు. ఈసారి జరగబోయే ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసేందుకు సంకల్పించినా, భారతీయ జనతా పార్టీకి రాజీనామా చేసేది లేదని ప్రకటించారు. భారత మాజీ ప్రధానమంత్రి అటల్‌ బిహారి వాజ్‌పేయి హయాంలో దేశ పురోగతి మార్గదర్శకంగా తన ఎన్నికల ప్రచారం చేపడతానని మీడియా సమావేశంలో వివరించారు. అటల్‌ బిహారి వాజ్‌పేయి ఆదర్శంగా ఓటర్‌ని సంప్రదించి గెలిపొందేందుకు సాయశక్తుల కృషి చేస్తానని తెలిపారు. బాలాసోర్‌ పార్లమెంటరీ నియోజకవర్గం అభివృద్ధి దృక్పథంతో తన ఎన్నికల ప్రచార కార్యక్రమం కొనసాగుతుందన్నారు. స్వతంత్ర అభ్యర్థిగా గెలిపొందితే భారతీయ జనతా పార్టీలో చేరుతానని బహిరంగపరిచారు.

రాజకీయ కలకలం

బీజేడీ 18 మంది లోక్‌సభ అభ్యర్థుల జాబితాను ఖరారు చేసిన వెంటనే ఐర ఖారబేల స్వంయి అసమ్మతి తెలపడంతో రాజకీయ కలకలం రేగింది. పార్టీతో ఉంటూ సొంత అభ్యర్థికి వ్యతిరేకంగా స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని ప్రకటించి రాజకీయ వ్యూహంలో కొత్త మెలిక పెట్టారు. బీజేపీ అభ్యర్థిగా పేరొందిన ఖారబేల స్వంయి 2010 సంవత్సరంలో ఉత్కళ భారత్‌ ప్రాంతీయ పార్టీ ఏర్పాటు చేశారు. తిరిగి 2019 సంవత్సరంలో భారతీయ జనతా పార్టీలో చేరారు. బీజేపీ అభ్యర్థిగా లోక్‌సభకు 3 సార్లు ఎన్నిక అయ్యారు. ఈసారి బీజేపీ కోసం స్వతంత్ర అభ్యర్థిగా మాజీ ప్రధాన మంత్రి అటల్‌ బిహారి వాజ్‌పేయ్‌ ఆదర్శాలతో పోటీ చేయనున్నట్లు ప్రకటించారు. గత ఎన్నికల్లో ఆయన కందమాల్‌ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేశారు. చివరి క్షణంలో బీజేపీ ఆయనకు టికెటు కేటాయించినా బిజూ జనతా దళ్‌ అభ్యర్థి డాక్టర్‌ అచ్యుత్‌ సామంత్‌తో తలపడ్డారు. ఈ పోరులో 1.5 లక్షల ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. అయితే ఈసారి ఎన్నికల్లో సకాలంలో పార్టీ తనకు బాలాసోర్‌ లోక్‌సభ స్థానం టికెటు కేటాయిస్తుందని ఎంతో ఆశతో నిరీక్షించారు.

ఆయుధ నిర్మాణ శాల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ఆయధ సామగ్రితో బీఎస్‌ఎఫ్‌ జవాన్లు

కొరాపుట్‌: దండకారణ్యంలో మావోయిస్టుల ఆయుధ నిర్మాణ శాల స్వాధీనమైంది. సోమవారం ఆంధ్రా–ఒడిశా సరిహద్దులోని కొరాపుట్‌ జిల్లా పొట్టంగి సమితి సుంకి సమీపంలోని వలసి అటవీ ప్రాంతంలో బీఎస్‌ఎఫ్‌ దళాలు కూంబింగ్‌ నిర్వహిస్తున్నాయి. ఈ సమయంలో సమీప కొండ మీద నుంచి ఇద్దరు వ్యక్తులు దళాలను చూసి ఆంధ్రా సరిహద్దు వైపు పరారయ్యారు. దీంతో జవానులు కొండపై గాలింపు చేపట్టారు. దీనిలో భాగంగా అక్కడ ఒక ఆయుధ నిర్మాణ శాల కనిపించింది. అందులో నాటు తుపాకుల తయారీ, మరమ్మతులు జరుగుతున్నాయి. అందుకు అవసరమైన ముడి సరుకు, నిర్మాణ సామగ్రి, కొన్ని తుపాకులు లభ్యమయ్యాయి. అలాగే ఆ ప్రాంతంలో ఒక సెల్‌ఫోన్‌ స్వాధీనం చేసుకున్నారు. పరారైన వ్యక్తుల కోసం గాలింపు ముమ్మరం చేశారు.



కొండపై ఆయుధ నిర్మాణ శాల



పట్టుబడిన తుపాకీ ముడి సరుకు

యువతను ఆకర్షించడమే ధ్యేయంగా..!

భువనేశ్వర్‌: రాష్ట్రంలో త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో కొత్త ఓటర్లు, యువత ఓట్లే గెలుపులో ప్రధాన పాత్ర పోషించనున్నాయి. దీంతో వీరి ఓట్లపై ముఖ్యమంత్రి నవీన్‌ పట్నాయక్‌ దృష్టి సారించినట్లు తెలుస్తోంది. కొత్తగా నమోదైన ఓటర్లను ఆకట్టుకోవడమే ప్రధాన లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు. ఈ వర్గం ఓటర్లని ఆకర్షించే వ్యూహాలపై బిజూ జనతా దళ్‌ (బీజేడీ) విద్యార్థి విభాగం నాయకులతో సోమవారం ఆయన నివాసంలో సమావేశమయ్యారు. ఇంతకు ముందు ఆదివారం స్థానిక శంఖ భవన్‌లో బీసీజేడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కీలక అంశాలను ప్రత్యక్షంగా చర్చించారు. 5టీ, నవీన్‌ ఒడిశా చైర్మన్‌ వి.కార్తికేయ పాండియన్‌, బీజేడీ సంస్థాగత కార్యదర్శి ప్రణబ్‌ ప్రకాష్‌ దాస్‌లు ఈ సమావేశంలో పాల్గొన్నారు. బీసీజేడీ అధ్యక్షుడు దేవి రంజన్‌ త్రిపాఠితో పాటు, విద్యార్థుల విభాగానికి చెందిన ఇతర కార్యకర్తలు ముఖాముఖి సంభాషించారు. ప్రజలను, ముఖ్యంగా మొదటిసారి ఓటర్లను ఎలా ఆకర్షించాలో పార్టీ అధినేత ముఖ్యమైన చిట్కాలను విద్యార్థి నాయకులకు అందించారు. ప్రజలకు చేరువ కావడంలో సామాజిక మాధ్యమాల ప్రాముఖ్యతను వారికి వివరించారు. యువ ఓటర్లను ఆకట్టుకోవడం, సోషల్‌ మీడియా ప్లాట్‌ఫారంలలో పార్టీకి వ్యతిరేక ప్రచారంపై నిఘా, ఓటర్ల ముందు నవీన్‌ పట్నాయక్‌ ప్రభుత్వ విజయాలపై ఓటరు వర్గంలో అవగాహన, చైతన్య కార్యాచరణపై బాధ్యతలు ఎలా నిర్వర్తించాలనే శీర్షికతో బిజూ ఛత్ర జనతా దళ్‌ బీసీజేడీ నాయకులు, కార్యకర్తలకు వివరించారు.

మోదీ హయాంలోనే కొరాపుట్‌ అభివృద్ధి



కార్యకర్తలకు అభివాదం చేస్తున్న కాళీరాం

కొరాపుట్‌: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హయాంలోనే కొరాపుట్‌ జిల్లాలు అభివృద్ధి పథంలో నడిచాయని కొరాపుట్‌ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి కాళీరాం మజ్జి అన్నారు. పార్టీ టిక్కెట్టు ప్రకటించిన వెంటనే సోమవారం కొరాపుట్‌ వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. జయపూర్‌లో ఎయిర్‌ పోర్టు నిర్మాణం, దండకారణ్యంలో భారతమాల వంటి ఆరు అంచెల ఎకనామిక్‌ కారిడర్‌ నిర్మాణం, కొరాపుట్‌, రాయగడ జిల్లాల్లో రైల్వేస్టేషన్ల ఆధునీకీకరణ, అనేక కొత్త రైళ్లు కొరాపుట్‌ వరకు నడపడం జరిగాయన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమమే తనను గెలిపిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అంతకుముందు బీజేపీ కార్యకర్తల ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు సుమంత్‌ ప్రధాన్‌ తదితరులు పాల్గొన్నారు.


సమష్టిగా పనిచేస్తే విజయం సులభం



మాట్లాడుతున్న కన్నుచరణ్‌ పతి

బరంపురం: రానున్న సార్వత్రిక ఎన్నికల కోసం నాయకులు సమష్టిగా పనిచేస్తే విజయం సులభమవుతుందని గంజాం జిల్లా బీజేపీ నాయకుడు కన్నుచరణ్‌ పతి అన్నారు. స్థానిక ఫస్ట్‌ గేట్‌ హరడఖండి జంక్షన్‌లోని మయూరి టవర్‌ సమావేశ మందిరంలో జిల్లాస్థాయి పార్టీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల కోసం ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. ప్రతీ పంచాయతీలోనూ పార్టీలో సభ్యులను చేర్చుకొని కిందిస్థాయి నుంచి పటిష్టమయ్యేలా సమావేశాలు జరపాలని కోరారు. దేశవ్యాప్తంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో బీజేపీ అనుకూల పవనాలు వీస్తున్నాయని, రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వం వస్తుందని దీమా వ్యక్తం చేశారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు ప్రభాత్‌ సడంగి, యువ మోర్చా నాయకుడు రాజేంద్ర కుమార్‌ సాహు, సునీల్‌ కుమార్‌ సాహు తదితరులు పాల్గొన్నారు.

ఆదుకోవమ్మా అగ్ని గంగమ్మా..!



పూజలందుకుంటున్న అగ్ని గంగమ్మ



క్యూలైన్‌లో ఉన్న భక్తులు



పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



సింధూరం విక్రయ దుకాణాలు



అమ్మవారి ఘటాలు

ఆంధ్ర, ఒడిశా ప్రజల ఆరాధ్య దైవంగా పూజలందుకుంటూ నీలావడిలో వెలసివున్న అగ్ని గంగమ్మ వార్షిక జాతర వైభవంగా కొనసాగుతోంది. దీనిలో భాగంగా సోమవారం అమ్మవారి దర్శనానికి భారీగా భక్తులు పోటెత్తారు. రాయగడ పరిసర ప్రాంతాలతో పాటు కొరాపుట్‌ జిల్లాకు చెందిన బందుగాం, నారాయణపట్నం, సొరుపల్లి గిరిజన గ్రామాల నుంచి, అదేవిధంగా పొరుగు పార్వతీపురం మన్యం జిల్లా నుంచి వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అమ్మవారి ప్రతిరూపంగా పిలిచే ఘటాలను దర్శించుకునేందుకు భక్తులు బారులుతీరారు. మందిరానికి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో పోలీసులు వాహనాలను నిలిపివేసి కాలి నడకన భక్తులను పంపిస్తున్నారు. దీంతో ట్రాఫిక్‌ నియంత్రణ చర్యలు పటిష్టంగా పోలీసు యంత్రాగం చేపట్టింది.

– రాయగడ

క్లుప్తంగా

కూర్మనాథుని సన్నిధిలో హైకోర్టు ఏజీ



శ్రీకూర్మనాథాలయంలో హైకోర్టు ఏజీ వేణుగోపాలం దంపతులు

గార: ప్రముఖ విష్ణుక్షేత్రం శ్రీకూర్మం కూర్మనాథుడిని హైకోర్టు ఏజీ పి.వేణుగోపాలం సతీసమేతంగా సోమవారం దర్శించుకున్నారు. ముందుగా మూలవిరాట్‌కు గోత్రనామాలతో పూజలు చేశారు. అనంతరం రెండు ధ్వజస్తంభాలు, లక్ష్మీసన్నిధి, వైష్ణవీదుర్గలను సందర్శించారు. ఆలయ ప్రధానార్చకులు చామర్తి సీతారామనృసింహాచార్యులు క్షేత్రమహాత్మ్యాన్ని తెలియజేయగా, ఈఓ గురునాథం క్షేత్ర ప్రసాదాన్ని అందజేశారు.

దేవీ ఆశ్రమంలో పౌర్ణమి పూజలు



మహామేరువుకు పుష్పాభిషేకం

ఎచ్చెర్ల: కుంచాలకూర్మయ్యపేట గ్రామంలోని దేవీ ఆశ్రమంలో పూర్ణిమ సందర్భంగా సోమవారం పలు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఇక్కడ ఉన్న రాజరాజేశ్వరీ అమ్మవారికి పలు అభిషేకాలను నిర్వహించారు. ఆవరణలో ఉన్న మహామేరువుకు, శ్రీచక్రాలకు ప్రత్యేక కుంకుమార్చనలు, అభిషేకాలు నిర్వహించారు.

'జాతీయ ఫెన్సింగ్ పోటీల్లో రాణించండి'



ఎంపికైన క్రీడాకారులతో ఫెన్సింగ్ సంఘ జిల్లా అధ్యక్షుడు రాజా, కోచ్ వంశీ

శ్రీకాకుళం న్యూకాలనీ: ఆలిండియా సబ్–జూనియర్స్ ఫెన్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో రాణించి జిల్లాకు పతకాలతో తిరిగిరావాలని ఫెన్సింగ్ అసోసియేషన్ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు బలభద్రుని సురేష్‌కుమార్(రాజా) పిలుపునిచ్చారు. రాజమండ్రిలోని జీఎస్‌ఎల్ మెడికల్ కళాశాల ప్రాంగణం వేదికగా మూడు రోజులపాటు జరగనున్న ఈ పోటీలకు జిల్లా నుంచి ఎస్.వెంకటసూర్య, ఎస్.గాయిత్రి ఎంపిక కాగా.. వీరిద్దరూ ఆదివారం రాత్రి ఇక్కడ నుంచి పయనమై వెళ్లారు. వీరికి శ్రీకాకుళం టౌన్‌హాల్‌లో వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఫెన్సింగ్ కోచ్ జోగిపాటి వంశీ పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



విరాళాన్ని అందజేస్తున్న దాత సుజాత

గార: శ్రీకూర్మనాథాలయంలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి విశాఖపట్నం నగరంలోని పీఎం పాలెంకు చెందిన కె.సుజాత రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. ఆలయ ఈఓ జి.గురునాథంకు సోమవారం ఆలయంలో విరాళాన్ని అందించారు.

క్రీడల్లో రాణించిన సచివాలయ ఉద్యోగి

కాశీబుగ్గ: ఇంటర్నేషనల్ ఓపెన్ పారా మెడికల్ చాంపియన్ షిప్ ఆరో మీట్ గత రెండు రోజులుగా బెంగళూర్‌లో జరుగుతోంది. ఈ క్రీడా పోటీల్లో పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ నర్సిపురం సచివాలయంలో వార్డు ఎమినిటీ సెక్రటరీగా పనిచేస్తున్న నెయ్యిల రమణయ్య ప్రతిభ చూపాడు. వంద మీటర్ల రన్నింగ్ పోటీల్లో సిల్వర్‌మెడల్ సాధించి విజేతగా నిలిచాడు. అనంతరం లాంగ్ జంప్‌లో బ్రాంజ్ మెడల్ సైతం సాధించాడు. ఈ సందర్భంగా పలువురు అభినందనలు తెలుపుతున్నారు.

వేణుగోపాలుడి సన్నిధిలో పర్లాకిమిడి మహారాణి



వేణుగోపాల ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మహారాణి కల్యాణిదేవి గజపతి

మెళియాపుట్టి: పర్లాకిమిడి మహారాజు కృష్ణచంద్ర గజపతి మనుమరాలు, ప్రస్తుత మహారాణి కల్యాణీ దేవీ గజపతి సోమవారం స్థానిక రాధాగోవింద స్వా మి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తన తాతగారి హయాంలో ఆల యం చుట్టూ భవనా లు, జామతోటలు ఇతరత్రా ఉండేవని ప్రస్తు తం ఆలయం శిథిలావస్థకు చేరిందని అన్నారు.



ఊరేగింపుతో వస్తున్న అమ్మవారు



గుడి వద్దకు చేరిన ఘటాలు

వైభవంగా మానక్టిమ్మా జాతర

మల్కన్‌గిరి జిల్లా కేంద్రంలో ఆదివారం ప్రారంభమైన గ్రామ దేవత మానక్టిమ్మా అమ్మవారి జాతర వైభవంగా జరుగుతోంది. దీనిలో భాగంగా అమ్మవారిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అమ్మవారి ఘటాలకు పూజలు చేశారు. ఈ సందర్భంగా పలువురి వేషధారణలు ఆకట్టుకున్నాయి.

- మల్కన్‌గిరి



మెయిన్ రోడ్డులో ఘటాల ఊరేగింపు



గుడి నుంచి బయలుదేరిన అమ్మవారు



కట్టప్ప వేషధారణలో కళాకారుడు



అమ్మవారి పూజార్లు

ఉగాది ఉత్సవాలకు ముహూర్తపు రాట



పూజలో పాల్గొన్న ఉత్సవ కమిటీ సభ్యులు

రాయగడ: ప్రతీ ఏడాదిలా ఈసారి కూడా ఉగాది ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు జిల్లా ఉగాది ఉత్సవ కమిటీ సన్నాహాలు ప్రారంభించింది. ఈ మేరకు స్థానిక తేజస్వి హోటల్ సమీపంలోని మైదానంలో ముహూర్తపు రాట కార్యక్రమం సోమవారం నిర్వహించారు. వేద పండితులు శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో జరిగే ఈ పూజల్లో పట్టణ ప్రముఖులు సీతయ్య, బార్జి ప్రసాద్‌రావులు కూర్చుని కార్యక్రమాలను కొనసాగించారు. ఉగాది ఉత్సవాల్లో భాగంగా ఏప్రిల్ 2వ తేదీ నుంచి 6వ తేదీ వరకు వివిధ పోటీలను నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని నిర్వాహకులు తెలియజేశారు. నెక్కంటి భాస్కరరావు ఆధ్వర్యంలో జరిగే ఈ ఉత్సవాల్లో గతేడాది కంటే ఈసారి మరిన్ని సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. కార్యక్రమంలో చంద్రమౌళి కుముందాన్, రాఘవ కుముందాన్ తదితరులు పాల్గొన్నారు.

చెట్టును ఢీకొన్న వ్యాన్



చెట్టును ఢీకొన్న వ్యాన్



సుధమ్ మండాల్ మృతదేహం

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి కంగుర్‌కొండ పెట్రోల్ బంక్ సమీపంలో ఒక వ్యాన్ చెట్టును ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందారు. వివరాల్లోకి వెళ్తే.. కొరాపుట్ జిల్లా సునబేడకు చెందిన సుధమ్ మండాల్, అరుణ్ మండాల్ ఇద్దరూ ఆదివారం పొట్టేరు జాతర చూసేందుకు వ్యాన్‌లో వచ్చారు. అనంతరం వాళ్ల బంధువుల ఇంటికి వెళ్లారు. అనంతరం సోమవారం ఉదయం తిరిగి పయనమవుతున్న సమయంలో సాయంత్రం 4 గంటలకు వారు తీసుకొచ్చిన వ్యాన్ చెట్టును ఢీకొనడంతో సుధమ్ మండాల్ అక్కడికక్కడే మృతి చెందగా, అరుణ్ తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా అరుణ్‌ను కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం మల్కన్‌గిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

కాళీరాం విజయానికి కృషి



సమావేశంలో పాల్గొన్న కాళీరాం మాఝితో శివపట్నాయక్, ఉలక తదితరులు

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు శివపట్నాయక్

రాయగడ: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా కొరాపుట్ లోక్‌సభ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేయనున్న కాళీరాం మాఝి విజయానికి అందరం కలిసికట్టుగా పనిచేస్తామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శివకుమార్ పట్నాయక్ స్పష్టం చేశారు. ఈ మేరకు స్థానిక సిరిగుడ గ్రామం వద్దనున్న ఆ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాళీరాం మాఝి బీజేపీ అభ్యర్థిగా కొరాపుట్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసేందుకు అధిష్టానం టిక్కెట్టు ఖరారు చేయడం హర్షణీయమన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే ప్రచారాస్త్రాలుగా ప్రజల ముందుకు వెళ్తామని తెలియజేశారు. ఈ స్థానం నుంచి ఇది వరకు గెలిపొందిన బీజేడీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నాయకుల వల్ల ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదని ఎద్దేవా చేశారు. ఈసారి ప్రజలు బీజేపీకి మద్దతు పలికితే ముఖ్యంగా జిల్లాలో మెడికల్ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఎన్నో ఏళ్ల నుంచి వేచి చూస్తున్న ఈ సమస్యకు సమాధానం బీజేపీ మాత్రమే ఇవ్వగలదన్నారు. అదేవిధంగా ప్రజల ఆర్థిక, సామాజిక రంగాల అభివృద్ధి కోసం పార్టీ పనిచేస్తుందన్నారు. సమావేశంలో ఆ పార్టీకి చెందిన బసంత కుమార్ ఉలక, త్రినాథ్ గొమంగో, గోవింద జైన్ తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ మొదటి వారంలో కాంగ్రెస్ జాబితా

- ఓపీసీసీ అధ్యక్షుడు శరత్ పట్నాయక్

భువనేశ్వర్: లోక్‌సభ, శాసనసభ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో జంట ఎన్నికలకు అభ్యర్థులను ఏప్రిల్ మొదటి వారంలో ప్రకటించేందుకు కాంగ్రెస్ సిద్ధమైందని ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఓపీసీసీ) అధ్యక్షుడు శరత్ పట్నాయక్ సోమవారం విలేకరులకు సోమవారం తెలిపారు. రాష్ట్రంలో లోక్‌సభ, శాసనసభ ఎన్నికలకు అభ్యర్థులను ఖరారు చేసే ప్రక్రియలో పార్టీ ఉందన్నారు. ఏప్రిల్ మొదటి వారంలో అభ్యర్థుల జాబితా విడుదల చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. స్క్రీనింగ్ కమిటీతో పాటు పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశాలు ఏప్రిల్ మొదటి వారంలో న్యూఢిల్లీలో జరగనున్నాయి. ఆ తర్వాత అభ్యర్థుల జాబితా వెలువడుతుందని చెప్పారు. జంట ఎన్నికలకు పార్టీ పూర్తిగా సిద్ధమైందని, పార్టీ అభ్యర్థుల ప్రచారం కోసం రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రాతో సహా సీనియర్ నేతలు రాష్ట్రానికి రాబోతున్నారని తెలిపారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలకు చెందిన ముఖ్యమంత్రులు, మంత్రులు కూడా ఒడిశాలో పార్టీ ఎన్నికల అవకాశాలను బలోపేతం చేసేందుకు రాష్ట్రంలో ప్రచారానికి దిగుతారని చెప్పారు.

సుందరగఢ్ నుంచే దిలీప్ తిర్కీ..?

భువనేశ్వర్: రాష్ట్రంలో ఆధిపత్యం కోసం ప్రధాన పక్షాలు ఎవరి తరహాలో వారు పావులు కదుపుతున్నారు. కొత్త ముఖాలు, యువతరం, మహిళలకు ప్రాధాన్యత కల్పించే దిశలో ప్రధాన పక్షాలు యోచిస్తున్న కొన్ని స్థానాల్లో గత ఎన్నికల్లో ఓటమి చవిచూసిన అభ్యర్థులకు పట్టం గట్టేందుకు వెనుకాడకపోవడం విశేషం. ఈ పంథాలో బిజూ జనతా దళ్ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్ హాకీ తారా స్థాయి క్రీడాకారుడు దిలీప్ తిర్కీని మరలా ప్రత్యక్ష ఎన్నికల బరిలోకి దింపేందుకు యోచిస్తున్నారు. ఇటీవల సుందర్‌గఢ్ లోక్‌సభ స్థానం, అనుబంధ అసెంబ్లీ సెగ్మెంట్లతో పాటు ఎన్నికల సన్నాహాలను సమీక్షించారు. సుందర్‌గఢ్ లోక్‌సభ స్థానం నుంచి బీజేడీ అభ్యర్థిగా హాకీ ఇండియా అధ్యక్షుడు దిలీప్ తిర్కీ ముందంజ అభ్యర్థిగా పరిగణనలోకి తీసుకున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. భారత మాజీ హాకీ కెప్టెన్ 2014 లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేసి 18,829 ఓట్ల స్వల్ప తేడాతో ఓడిపోయాడు. 2014 ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ అభ్యర్థి జుయెల్ ఓరం 18,829 ఓట్ల తేడాతో బిజూ జనతా దళ్ అభ్యర్థి దిలీప్ కుమార్ తిర్కీపై విజయం సాధించారు. ఈసారి కూడ బీజేపీ జుయెల్ ఓరంని సుందరగఢ్ పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి పోటీకి నిలబెట్టింది. బీజేడీ దిలీప్ తిర్కీ అభ్యర్థిత్వం ఖరారు చేస్తే పాత ప్రత్యర్థుల మధ్య సరికొత్త వాతావరణంలో ధీటైన పోటీ నెలకొంటుంది. దిలీప్ తిర్కీ ఇప్పటికే రాజ్యసభ సభ్యుడిగా పదవీకాలం పూర్తి చేశారు. రాష్ట్రంలో సుందరగఢ్ హాకీ పుట్టినిల్లు. ప్రపంచ కప్‌తో సహా అనేక అంతర్జాతీయ హాకీ ఈవెంట్‌లు ఈ నియోజకవర్గం రౌర్కెలా కేంద్రంగా విజయవంతంగా నిర్వహించారు. ఈ విజయగాథ తెర వెనక అధినేతగా దిలీప్ తిర్కీ హాకీ క్రీడా రంగంలో విశేష గుర్తింపు సాధించడంతో ప్రజాదరణ నోచుకుంది. ఈ ఆధారంతో మరోసారి దిలీప్ తిర్కీని బరిలోకి దింపి సుందరగఢ్ లోక్ సభ స్థానం కై వసం చేసుకోవాలని బీజేడీ యోచిస్తుంది.



జగన్నాథుని సన్నిధిలో గవర్నర్

రాష్ట్ర గవర్నర్ రఘుబర దాస్ సతీసమేతంగా పూరీ సందర్శించి శ్రీజగన్నాథుని దర్శించుకున్నారు. పవిత్ర దోల పూర్ణిమ, హోలీ పండగ పురస్కరించుకుని సోమవారం కుటుంబ సమేతంగా దర్శించుకొని రాష్ట్రం, రాష్ట్ర ప్రజల క్షేమం కోసం ప్రార్థించినట్లు గవర్నర్ తెలిపారు.

- భువనేశ్వర్/పూరీ

గంజాయితో నలుగురు అరెస్టు



గంజాయితో పట్టుబడిన నిందితులు

రాయగడ: గజపతి జిల్లా ఉదయగిరి నుంచి అక్రమంగా గంజాయిని తరలిస్తుండగా పద్మపూర్ పోలీసులు నలుగురు నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి 32 కిలోల గంజాయితో పాటు రూ.2,050 నగదు, మరో మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కోర్టుకు తరలించారు. సోమవారం ఎప్పటిలాగే పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా పద్మపూర్ సరిహద్దులో నలుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని తనిఖీ చేయగా, ఒక ప్లాస్టిక్ బ్యాగ్‌లో 32 కిలోల గంజాయి పట్టుబడింది. అరెస్టైనవారిలో పద్మపూర్ ప్రాంతానికి చెందిన సుమన్ మాఝి, మాల్కెల్ నాయక్, వినోద్ కరాడ్, సునాస్ ప్రధాన్‌లు ఉన్నారు.


శ్రీక్షేత్రంలో డోలోత్సవం



శ్రీ మందిరం ప్రాకార ప్రాంగణంలో డోల గోవిందుని ఊరేగింపు



డోల గోవిందుని యాత్రలో భక్తజనం



రంగుల భరితం డోల గోవిందుడు

భువనేశ్వర్: పూరీ శ్రీక్షేత్రంలో డోలోత్సవం అత్యంత ఆనందోత్సాహాలతో జరిగింది. డోల పూర్ణిమ పురస్కరించుకుని సోమవారం ఈ ఉత్సవం నిర్వహించారు. శ్రీ మందిరం ప్రాకార ప్రాంగణంలో నిర్వహించిన డోలోత్సవంలో ఆబాల గోపాలం భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. శ్రీజగన్నాథుని ప్రతినిధి మూర్తిగా డోల గోవిందుని ప్రతిమతో ఉత్సవం ఆనందభరితంగా సాగింది.

పల్లకిలో డోల గోవిందుడు ఊరేగుతుండగా భక్తజనం రంగులు జల్లుకుని డోల మండపానికి తరలించారు. ఈ వేదికపై ప్రత్యేక పూజాదులు నిర్వహించారు. శ్రీజగన్నాథుని శ్రీక్షేత్రంలో ఏటా జరిగే ద్వాదశ యాత్రల్లో డోల యాత్ర ఒకటిగా పేరొందింది.



డోలోత్సవ సందడి

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు



లారీని క్రేన్ సాయంతో తొలగిస్తున్న దృశ్యం

టెక్కలి రూరల్: మండలంలోని కె.కొత్తూరు గ్రామ సమీప జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు..పలాస నుంచి శ్రీకాకుళం వైపు ఐరన్ గజాల లోడ్‌తో వెళ్తున్న లారీని కె.కొత్తూరు సమీపంలో వెనుక నుంచి రైల్వే సామగ్రి తీసుకువస్తున్న మరో లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెనుక నుంచి ఢీకొట్టిన లారీ డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. స్థానికులు గుర్తించి హైవే అంబులెన్స్‌కు సమాచారం అందజేశారు. దీంతో స్థానికుల సాయంతో డ్రైవర్‌ను బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు. అనంతరం క్రేన్ సాయంతో లారీని పక్కకు తీశారు. ఘటనపై టెక్కలి పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు పోలీసులు వివరాలు సేకరించి కేసు నమోదు చేయనున్నట్లు తెలిపారు.

మందస బస్టాండ్‌లో వ్యక్తి మృతి



రాజావారికోట ఆవరణలో సింహాచలం మృతదేహం

మందస: మందస బస్టాండ్‌లోని రాజావారి కోట ఆవరణలో సింహాచలం(45) అనే వ్యక్తి సోమవారం మరణించాడు. చిత్తు కాగితాలు, ప్లాస్టిక్ వస్తువులను ఏరుకుని, మందసలోనే ఇటీవల తిరుగుతుండేవాడని స్థానికులు చెబుతున్నారు. ఏమైందో, ఏమో శవమై కనిపించాడు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ బి.అనిల్‌కుమార్, మందస ఈఓ బమ్మిడి నవీన్‌కుమార్, వీఆర్‌ఓ కె.భైరాగి, రెల్ల లక్ష్మీనారాయణ సంఘటనా స్థలానికి చేరుకుని, వివరాలు ఆరా తీశారు. సింహాచలం(సిమ్మ) సొంత గ్రామం పలాసగా గుర్తించి, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని బంధువులు తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

అరటితోటలో ఏనుగుల గుంపు



గవరమ్మపేట వద్ద ఉన్న అరటి తోటలో ఉన్న ఏనుగుల గుంపు

జియ్యమ్మవలస: మండలంలోని గవరమ్మపేట, వెంకటరాజపురం మధ్య ఉన్న అరటి తోటల్లో ఏనుగుల గుంపు తిష్ట వేసింది. సోమవారం ఉదయం వరిచేలలో ఉన్న ఏనుగులు సాయంత్రానికి అరటితోటలోకి చేరుకోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. నాలుగు రోజుల నుంచి గవరమ్మపేట, వెంకటరాజపురం పరిసర ప్రాంతాల్లో ఏనుగుల సంచారంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రాత్రి సమయంలో ఎక్కడికి వెళ్తాయోనంటూ వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పంట చేలలోకి ఏనుగులు వెళ్లకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సారా తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్



అదుపులోకి తీసుకున్న వ్యక్తితో చినమేరంగి పోలీసులు

జియ్యమ్మవలస: మండలంలోని చిన మేరంగి గ్రామంలో అక్రమంగా సారా తరలిస్తున్న వ్యక్తిని సోమవారం అరెస్ట్ చేసినట్లు చిన మేరంగి ఎస్సై చిన్నం నాయుడు తెలిపారు. గ్రామంలోని రెల్లి వీధికి చెందిన ఓ వ్యక్తి ఒడిశా రాష్ట్రంలోని సందుబడి గ్రామం నుంచి అక్రమంగా 15 లీటర్ల సారా తరలించినట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించామని ఎస్సై చిన్నంనాయుడు వివరించారు.

347 మద్యం బాటిల్స్ పారబోత



మద్యం బాటిల్స్‌ను డిస్పోజ్ చేస్తున్న దృశ్యం

గంట్యాడ: ఎక్సైజ్ శాఖ దాడుల్లో స్వాధీనం చేసుకున్న 347 మద్యం బాటిల్స్‌ను ఆ శాఖ సిబ్బంది సోమవారం పారబోశారు. మండలంలో ఎక్సైజ్, పోలీస్ శాఖలు చేపట్టిన 14 దాడుల్లో 347 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు. వాటిని గంట్యాడ పోలీస్‌స్టేషన్ ఆవరణంలో ఎస్ఈబీ డీఎస్పీ బీజీజీ రాజు, ఎస్సై సురేంద్ర నాయుడు ఆధ్వర్యంలో డిస్పోజ్ చేశారు.

మద్యం అక్రమరవాణా కేసుల నమోదు

విజయనగరం క్రైమ్: జిల్లా వ్యాప్తంగా మద్యం అక్రమరవాణాపై పోలీసులు సోమవారం దాడులు నిర్వహించారు. ఈ మేరకు మద్యం అక్రమ రవాణాకు పాల్పడిన నిందితులపై 16 కేసులు నమోదుచేసి 60.3 లీటర్ల ఐఎంఎఫ్ఎల్ మద్యం స్వాధీనం చేసుకున్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగే వారిపై 32 కేసులు, మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై 20 కేసులు, కోడిపందాలు, పేకాట ఆడుతున్న వారిపై మూడుకేసులు నమోదుచేసి, 13 మందిని అదుపులోకి తీసుకుని రూ.7060 నగదు, మూడు కోడిపుంజులను స్వాధీనం చేసుకున్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



జితేంద్ర (ఫైల్)

చీపురుపల్లి రూరల్(గరివిడి): గుర్ల మండలంలోని చింతపల్లిపేట గ్రామానికి చెందిన మామిడి జితేంద్ర(23) గరివిడి రైల్వే ట్రాక్‌పై అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉన్నాడు. ఈ సంఘటనకు సంబంధించి జీఆర్పీ ఎస్సై మధు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆదివారం రాత్రి గరివిడి రైల్వే ట్రాక్‌పై ఫోన్ రింగును గమనించి స్థానిక వ్యాపారులు వెళ్లి చూడగా జితేంద్ర తీవ్ర గాయాపాలై కొన ఊపిరితో ఉన్నాడు. ఫోన్ లిఫ్ట్ చేసి స్నేహితులకు ఈ విషయాన్ని చెప్పగా వారు వచ్చి విజయనగరం సర్వజన ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఈ సంఘటనపై స్టేషన్ సూపరింటెండెంట్‌కు వచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ ఎస్సై చెప్పారు.

సంక్షేమంతో ఆత్మాభిమానం

- ఎన్నికల ప్రచార సభలో మంత్రి బొత్ససత్యనారాయణ



సభలో మాట్లాడుతున్న రాష్ట్ర విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ



ఎన్నికల ప్రచారంలో గ్రామస్తులతో మమేకమైన మంత్రి బొత్స సత్యనారాయణ

మెరకముడిదాం: గత టీడీపీ ప్రభుత్వంలో మహిళలు, రైతులను పట్టించుకున్న పాపాన పోలేదని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత మహిళలు, రైతులు ఆత్మాభిమానంతో బతికే విధంగా అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి ఆర్థికంగా ఆదుకున్నామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్ససత్యనారాయణ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన మెరకముడిదాం మండలంలోని గాతాడ గ్రామంలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుతో కలిసి ఎన్నికల ప్రచార సభ నిర్వహించారు. ఈ సభలో ఆయన మాట్లాడుతూ రైతులు, పేదలు కడుపునిండా అన్నం తినాలంటే జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని పిలుపునిచ్చారు. గత టీడీపీ హయాంలో గాతాడ గ్రామానికి చేసిన అభివృద్ధి, తమ హయాంలో చేసిన అభివృద్ధిని బేరీజు వేసుకుని తమకు ఓటు వేయాలని కోరారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన తరువాత వలంటీర్ల వ్యవస్థ, సచివాలయ సిబ్బంది ద్వారా గ్రామంలో మీ ఇంటి వద్దకే పరిపాలన తీసుకువచ్చి దేశంలో ఎక్కడా లేని విధంగా అవినీతి రహిత సంక్షేమ పథకాలను అందించారన్నారు. గాతాడ గ్రామానికి తాగునీరు, రహదారి సౌకర్యాన్ని కల్పించింది ఎవరో ప్రజలు గుర్తెరగాలని పిలుపునిచ్చారు. గతంలో పెన్షన్లు తీసుకునేందుకు అధికారులు, జన్మభూమి కమిటీల చుట్టూ ప్రదక్షిణ చేస్తూ పడిగాపులు కాయాల్సి వచ్చేదని ఇప్పుడు అదే పెన్షన్‌లను వలంటీర్ల ద్వారా ఒకటవ తేదీన ఉదయాన్నే ఇంటికి తీసుకు వచ్చే విధంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అమలు చేశారన్నారు.

కళ్లకు కట్టేలా చీపురుపల్లి అభివృద్ధి

అనంతరం జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు ఆరోగ్య శ్రీని పేద ప్రజలకు మరింత చేరువ చేసే విధంగా రూ.25 లక్షల వరకు పెంచి కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. చీపురుపల్లి నియోజకవర్గానికి బొత్ససత్యనారాయణ ఎమ్మెల్యే కాకముందు ఎంత వెనుకబడి ఉండేదో, ఆయన ఎమ్మెల్యే అయిన తరువాత ఎంత అభివృద్ధి చెందిందో ప్రజలందరికీ కళ్లకు కడుతోందన్నారు. తాను గాని, మంత్రి బొత్ససత్యనారాయణ గాని, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు కానీ అనునిత్యం మీతో మమేకమై ఉంటామన్నారు. అదే తెలుగుదేశం నాయకులు ఎన్నికలు ముందు ఓట్లు అడిగేందుకు వస్తారు తప్పా ప్రజల కష్టసుఖాలు వారికి పట్టవన్నారు. అలాంటి నాయకులు కావాలో నిత్యం అందుబాటులో ఉన్న నాయకులు కావాలో ఆలోచించి ప్రజలు నిర్ణయం తీసుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో మంత్రి బొత్ససత్యనారాయణ తనయుడు బొత్స సందీప్‌బాబు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్‌వీ రమణరాజు, తాడ్డి వేణుగోపాలరావు, కోట్ల విశ్వేశ్వరరావు, వైస్ ఎంపీపీ తలచట్ల హరిబాబు, పప్పల కృష్ణమూర్తి, కేఎస్ఆర్‌కే ప్రసాద్, స్థానిక నాయకులు గిడిజాల సింహాచలం, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

ఎన్డీయేకు దూరమవుతున్న తూర్పుకాపులు

- కాపు సంఘం నాయకులు



టీడీపీ, కూటమి పార్టీలకు బుద్ధి చెబుతామంటున్న కాపు సంఘం, టీడీపీ సీనియర్ నాయకుడు

పాలకొండ రూరల్: తెలుగుదేశం పార్టీ, దాంతో కలిసి వస్తున్న కూటమి పార్టీలు ఉత్తరాంధ్రంలో తూర్పుకాపులను దూరం చేసుకుంటున్నాయని స్థానిక తూర్పుకాపు సంక్షేమ సంఘ అధ్యక్షుడు కనపాక చౌదరినాయుడు అవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో దాదాపు 35 లక్షల మంది తూర్పుకాపులు ఉన్నారని, తమకు ప్రతినిధిగా ఉన్న కిమిడి కళావెంకటరావుపై ఈర ్ష్యతో, తమ సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం తగ్గించేలా కూటమి వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఎచ్చెర్ల, నెల్లిమర్ల అసెంబ్లీ స్థానాలకు సంబంధించి టికెట్ల కేటాయింపుపై కూటమి పార్టీల తీరును తప్పుబట్టారు. టీడీపీపై నమ్మకం సడలిపోతున్నట్లు పేర్కొన్నారు. తమ సామాజిక వర్గానికి పట్టు ఉన్న నియోజకవర్గాల్లో ఓటమిని కోరి కొనితెచ్చుకునేలా వ్యవహరిస్తోన్నరన్నారు. దీనిపై స్పందించకుంటే ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో శ్రీకాకుళం పార్లమెంట్, నరసన్నపేట, టెక్కలి, ఇచ్ఛాపురం, ఆమదాలవలస, రాజాం, పాలకొండ అసెంబ్లీ నియోజకవర్గాల్లో భంగపాటు తప్పదని హెచ్చరించారు. ఈ ప్రాంత తూర్పు కాపులు తమ ఓటు ద్వారా టీడీపీ, కూటమికి బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేశారు. టీడీపీ రాష్ట్ర, జిల్లా అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు, కూన రవికుమార్ అవకాశవాద రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. వారి స్వలాభం కోసం తూర్పుకాపులను అణిచివేసే ధోరణితో ముందుకు వెళ్తున్నారని ధ్వజమెత్తారు. దీనిని తాము గమనిస్తున్నామని, రానున్న ఎన్నికల్లో కచ్చితంగా బుద్ధి చెప్పి తీరుతామని హెచ్చరించారు. ఈ విషయంలో చంద్రబాబు తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో టీడీపీ సీనియర్ నాయకుడు, తూర్పుకాపు సంఘం నాయకుడు కరణం వరహాల నాయుడు, సంఘం నాయకులు నారు జనార్దనరావు, పాలవలస సత్యనారాయణ, రామినాయుడు, వండాన కూర్మారావు తదితరులు విలేకరుల సమావేశంలో తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

బాలుడి హత్యకేసులో ముద్దాయికి యావజ్జీవం

విజయనగరం క్రైమ్ /రాజాం సిటీ: సంతకవిటి మండలంలోని కొండగూడెం గ్రామానికి చెందిన రెడ్డి దుర్గా ప్రసాద్(13) అనే బాలుడి హత్య కేసులో ప్రధాన ముద్దాయి కొండపల్లి గోవిందరావుకు జిల్లా అదనపు జడ్జి, ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి టి.భాస్కరరావు యావజ్జీవ కారాగార శిక్ష, రూ. 2వేలు జరిమానా విధించారు. ఈ మేరకు రాజాం రూరల్ సీఐ ఎస్.శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. రేగిడి మండలం లింగాలవలస గ్రామానికి చెందిన రెడ్డి సూరపునాయుడు కుటుంబంతో సహా వలస వచ్చి సంతకవిటి మండలంలోని కొండగూడెం గ్రామంలో స్థిరపడ్డాడు. సూరపునాయుడు కుటుంబానికి గ్రామానికి చెందిన గోవిందరావు కుటుంబానికి తరచూ గొడవలు జరిగేవి. అవకాశం కోసం ఎదురుచూస్తున్న గోవిందరావు గ్రామానికి చెందిన కొండపల్లి సింహాచలం, కొండపల్లి శంకరరావు, కొండపల్లి లక్ష్మీనారాయణ, కొండపల్లి అన్నపూర్ణల సహాయంతో గ్రామంలోని ఆంజనేయస్వామి గుడి వద్ద సూరపు నాయుడు కుమారుడు రెడ్డి దుర్గాప్రసాద్‌ను 2021 మే 1న రాత్రి 8 గంటల సమయంలో హత్యచేశాడు. ఈ విషయంపై ఫిర్యాదు మేరకు అప్పటి సంతకవిటి ఎస్సై సీహెచ్ రామారావు కేసు నమోదుచేయగా, సీఐ డి.నవీన్‌కుమార్ కేసు దర్యాప్తు నిర్వహించారు. దర్యాప్తులో భాగంగా నిందితులు ఐదుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అనంతరం సీఐ బదిలీకావడంతో ప్రస్తుత సీఐ శ్రీనివాసరావు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని హెచ్‌సీ ఇ.తారకేశ్వరరావు సహాయంతో సాక్షులను సకాలంలో కోర్టులో హాజరుపర్చారు. ఈ కేసును అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాన కృష్ణచంద్ వాదించగా నేరం రుజువు కావడంతో ఏడీజే, ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి భాస్కరరావు పై విధంగా శిక్ష విధించారు.

పీహెచ్‌సీల్లో కార్పొరేట్ వైద్యం



అత్యాధునిక ల్యాబ్

- వైద్యరంగానికి ప్రభుత్వం పెద్దపీట
- అందుబాటులో అత్యాధునిక పరికరాలు



ఆస్పత్రి ఆవరణలో 104 వాహనం

సంతకవిటి: ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. నాడు-నేడు కార్యక్రమం పీహెచ్‌సీల అభివృద్ధికి భారీగా నిధులు కేటాయించారు. గ్రామ సచివాలయాల పరిధిలో వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లను నిర్మించి గ్రామస్థాయిలోనే ప్రజలకు వైద్య సేవలందించేలా చర్యలు తీసుకున్నారు. వైద్యారోగ్య శాఖ ద్వారా పీహెచ్‌సీల్లో పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించడంతో పాటు అధునాతన వైద్య పరికరాలు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఒక్కో పీహెచ్‌సీకి టెలీ, పీసీఆర్, బయోకెమిస్ట్రీ ఎనలైజర్, ఎలక్ట్రోలైట్ ఎనలైజర్, సీబీసీ తదితర పరికరాలు ప్రభుత్వం అందజేసింది. గతంలో 15 రకాల వైద్య సేవలు మాత్రమే అందుబాటులో ఉండగా.. నేడు 63 రకాల వైద్య పరీక్షలు చేస్తున్నారు. గతంలో ఈ ప్రాంతానికి చెందిన రోగులు వైద్యం కోసం రాజాం, శ్రీకాకుళం పట్టణాల్లోని ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లేవారు. ప్రస్తుతం పెద్దాసుపత్రిలో అందే వైద్య సేవలన్నీ పీహెచ్‌సీలోనే అందుతుండటంతో ఇక్కడకు వచ్చి వైద్యం చేయించుకుంటున్నారు.

వైద్య పరీక్షలు

హెచ్‌బీ, బ్లడ్ గ్రూప్, హెచ్ఐవీ, హెచ్‌సీఎస్‌జీ, వీడీఆర్ఎల్, గల్ల పరీక్ష, ర్యాండం బ్లడ్ సుగర్, మలేరియా, డెంగీ, వైడల్, హెజ్‌సీవీ, యూరియా క్రియాటిన్, ప్లేట్లెట్ కౌంట్, ఎస్‌ఓటీ, ఎస్‌జీపీటీ, ఏఎల్పీ, లిపిడ్ ప్రొఫైల్, పొటాషియం, సోడియం, క్లోరైడ్, యూరిన్ మైక్రోస్కోపిక్ వంటి 63 రకాల పరీక్షలు చేస్తున్నారు.

జ్ఞానానికి ఆధ్యాత్మికతే శరణ్యం

రేగిడి: జ్ఞానానికి ఆధ్యాత్మికతే శరణ్యమని విశాఖపట్నం జిల్లా పెందుర్తికి చెందిన శివానందాశ్రమ పీఠాధిపతి స్వామి విష్ణుదేవానంద సరస్వతి అన్నారు. ఈ మేరకు సోమవారం మండలంలోని రేగిడి గ్రామంలో వెలసిన దత్త పీఠంలో హోలీ పౌర్ణమి సందర్భంగా ఆధ్యాత్మిక గురువు కిమిడి సత్యనారాయణనాయుడు ఆధ్వర్యంలో దత్తజ్ఞాన బోధ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జ్ఞానాన్ని పొందే మార్గాలను భక్తులకు ఆయన వివరించారు. కాలం మారినప్పటికీ మారని ఒకే ఒక జ్ఞాన మార్గం దైవ చింతేనని తెలిపారు. సనాతన ధర్మాలన్నీ సైన్స్ కంటే ముందుగానే విపత్తును కనిపెట్టి, వాటిని అదుపుచేసే మార్గాలను కూడా సూచించాయని తెలిపారు. ప్రజలు ఎప్పుడైతే ఈ నిజాలు తెలుసుకుంటారో అప్పుడే జ్ఞానమార్గాన్ని, మోక్ష మార్గాన్ని పొందుతారని, శాంతిని పొందగలరని వెల్లడించారు. కార్యక్రమంలో దత్తపీఠ కన్వీనర్ రుంకు శ్రీనివాసరావు మాస్టారు, యర్రాపాత్రుని భాస్కరరావు, కుదుతుల మురళి, జల్లు శివ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

బొబ్బిలి: పట్టణంలోని గొల్లవీధి బంగారమ్మ కాలనీకి చెందిన యువకుడు ఆలపాటి వెంకట సాయి రామకృష్ణ(25) బావిలో పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మూడురోజుల క్రితం ఇస్కాన్ టెంపుల్‌కు వెళ్తానని ఇంట్లో తల్లికి చెప్పాడు. అప్పటి నుంచి సెల్‌ఫోన్ స్విచాఫ్ వస్తోంది. ఈలోగా బొబ్బిలి పట్టణంలోని రాణి గారి తోటలో ఆఫీసర్స్ క్లబ్ వద్ద గల నేల బావిలో సోమవారం శవమై తేలాడు. ఈ విషయాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వచ్చి మృతదేహాన్ని బయటకు తీసి శవపరీక్ష చేసి తల్లికి అప్పగించారు. మృతుడి తల్లి చికెన్ విక్రయిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటోంది. తండ్రి సూరిబాబు ఆర్థిక ఇబ్బందులతో ఇటీవలే ఆత్మహత్య చేసుకున్నాడు. ఇప్పుడు సాయి రామకృష్ణ కూడా ఆత్మహత్యకు పాల్పడడంతో తల్లి గుండెలవిసేలా రోదిస్తోంది. పట్టణంలోని 15 వార్డులో ఏడో సచివాలయం పరిధిలో వలంటీర్‌గా సాయి రామకృష్ణ పనిచేస్తున్నాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎం.నాగేశ్వర రావు తెలిపారు.

నేడు శంబర పోలమాంబ పదో జాతర



శంబర పోలమాంబ అమ్మవారు అమ్మవారు

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మరి పదో జాతర మంగళవారం జరుగునుంది. జాతరకు వచ్చిన భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఈఓ వి.వి.సూర్యనారాయణ పర్యవేక్షణలో సిబ్బంది ఏర్పాట్లు పూర్తి చేశారు. లడ్డూ, పులిహోర ప్రసాదాలను సిద్ధం చేయించారు. జాతర సందర్భంగా ఉదయం 9 గంటలకు చండీ హోమం నిర్వహించనున్నారు. ఎస్సై నరసింహమూర్తి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు అన్నసమారాధన చేస్తామని ఈఓ తెలిపారు.

మన్నార్ రాజగోపాలునికి శ్రీచక్రస్నానం



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న శ్రీరామానుజ జీయర్ స్వామి, ఆలయ ఈఓ వంశీలక్ష్మి, తదితరులు

విజయనగరం టౌన్: స్థానిక కొత్తపేట అనాసరపు వారి వీధిలో ఉన్న మన్నార్ రాజగోపాలస్వామి ఆలయంలో ఈ నెల 19 నుంచి నిర్వహిస్తున్న స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ఘనంగా ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో శ్రీరామానుజ జీయర్‌స్వామి ముఖ్య అతిథిగా పాల్గొని భక్తులకు ఆశీర్వచనం, ఆధ్యాత్మిక ప్రవచనం అందజేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారిణి వంశీలక్ష్మి స్వీయ పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకుడు ఫణిహారం మణిబాబు, కమిటీ సభ్యురాలు కూర్మెళ్ల సరోజిని ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ ఐశ్వర్యలక్ష్మి అమ్మవారి తిరునక్షత్ర దర్శనం ఫాల్గుణ పౌర్ణమి సందర్భంగా స్వామివారికి శ్రీచక్రస్నానం, పూర్ణాహుతి, రాత్రి పవళింపుసేవ చేశారు. అనంతరం నర్తనశాల డ్యాన్స్ డైరెక్టర్ డాక్టర్ భేరి రాధికారాణిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన నృత్యప్రదర్శన ఆహూతులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ చెరుకూరి శ్రీధర్, సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

హోలీ వేడుకల్లో జెడ్పీ చైర్మన్



హోలీ వేడుకల్లో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, పుష్పాంజలి దంపతులు

విజయనగరం రూరల్: హోలీ పర్వదినాన్ని పురస్కరించుకుని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు నివాసంలో ఆదివారం రాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్, వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర డిప్యూటీ కోఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు, ఆయన సతీమణి మజ్జి పుష్పాంజలి, కుమార్తె మజ్జి సిరి సహస్రలు వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు జిల్లా ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆశీస్సులు జిల్లా ప్రజలందరిపై ఉండాలని, హోలీ పండగ అందరిలోనూ ఉత్సాహాన్ని నింపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ కుటుంబసభ్యులు, స్నేహితులు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు



పార్టీలో చేరుతున్నవారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న డాక్టర్ తలే రాజేష్

రాజాం: రాజాం మున్సిపాల్టీ పరిధిలోని కొండంపేట గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ ఆధ్వర్యంలో సోమవారం పార్టీలో చేరారు. ఈ మేరకు గ్రామంలో డాక్టర్ తలే రాజేష్ ఎన్నికల ప్రచారం నిర్వహించిన సందర్భంగా పార్టీలో చేరికలు జరిగాయి. గ్రామానికి చెందిన సలాది రామదాసు, సత్తీష్, లెంకరమణ, బత్తుల యోగి, దొండపాటి శ్రీనివాసరావు, సలాది శ్రీను, బుద్దన గోవింద, పెద్ది శ్రీను, సలాది వెంకటరమణ, పెల్లూరి శ్రీను, సలాది రమణ, సలాది అప్పన్న, సలాది సురేష్, కె.వెంకటరమణ, కోటి, దేశలంక రమణ, లంకలపల్లి చిన్నారావు, అడపా నర్సింగరావు, సలాది లక్ష్మణ, పెద్ది సత్యం. పిడుగు సత్తి, అంజి, లంకలపల్లి సురేష్, ముద్దన గోవింద, సలాది గోవిందమ్మ, శ్రీదేవి, ఎల్. శివ, సాయి, కె.గోవిందమ్మ, రావాడ మధు తదితరులతో పాటు మరో 90మందికి పైగా టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారందరికీ పార్టీ కండువాలు వేసి డాక్టర్ రాజేష్ సాదరంగా స్వాగతం పలికారు. మనమంతా కలిసికట్టుగా పనిచేసి, సార్వత్రిక ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా గెలిపించుకోవాలని రాజేష్ ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, జేసీఎస్ కన్వీనర్ పాలవలస గోపి, సలాది తులసీరావు మాస్టారు, శాసపు వేణుగోపాల నాయుడు, దూబ గోపాలం, ఆర్నేపల్లి వెంకటనాయుడు, సింబాల రాము, యందవ సత్యనారాయణ, జేసీబీ శ్రీను, పాలవలస శ్యామ్, తోట తిరుమలరావు, కోళ్ల రమ్య, యందవ సుశీల తదితరులు పాల్గొన్నారు.

చీరకు నిప్పంటుకుని మహిళ మృతి

- చీరకు నిప్పంటుకోవడంతో ప్రమాదం



బంగారమ్మ (ఫైల్)

గజపతినగరం/గజపతినగరం రూరల్: గజపతినగరం మండలంలోని కొత్తబగ్గాం గ్రామానికి చెందిన ఓ మహిళ అగ్నిప్రమాదంలో కాలిపోయి తీవ్రగాయాల పాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. సోమవారం ఉదయం జరిగిన ఈ సంఘటనపై గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన సారిక బంగారమ్మ (45) పొలంలో నారుమడిని తయారు చేసేందుకు ముందుగా మడిలో ఉన్న కర్రపుల్లలు, ఆకులు, తాటికమ్మలు ఒక చోటకు చేర్చి మంటపెట్టింది. ఆ సమయంలో చీర కొంగుకు మంటలు తాకడం, అదే సమయంలో ఆమెకు ఫిట్స్ రావడంతో 90శాతం శరీరం కాలిపోయింది. తక్షణమే కుటుంబసభ్యులు బాధితురాలిని 108వాహనంలో గజపతినగరం ఏరియా ఆస్పత్రికి తరలించగా వైద్యసేవలు అందించారు. ఈ విషయంపై పోలీసుల ద్వారా సమాచారం తెలుసుకున్న స్థానిక ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ జూనియర్ సివిల్ జడ్జి కనకలక్ష్మి ఆస్పత్రికి వచ్చి బాధితురాలిని పరిశీలించి వాంగ్మూలం తీసుకున్నారు. తరువాత మెరుగైన వైద్యం కోసం విజయనగరం సర్వజన ఆస్పత్రికి బాధితురాలిని తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలికి భర్త అప్పారావు, పెళ్లిడుకు వచ్చిన ఇద్దరు కుమార్తెలు, ఒక బాబు ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు గజపతినగరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బంధువులకు వృద్ధురాలి అప్పగింత

విజయనగరం క్రైమ్: విశాఖపట్నం నుంచి కంటి పరీక్షలకు విజయనగరం వచ్చిన 70 ఏళ్ల వృద్ధురాలు సోమవారం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఒంటరిగా ఉన్నట్లు గుర్తించిన వన్‌టౌన్ హెచ్‌సీ ఏవీ.రమణరావు, కానిస్టేబుల్ కిశోర్ స్పందించారు. దీంతో ఆమెను బాబామెట్టలోని ఏటీకే వృద్ధాశ్రమంలో చేర్పించి, ఆమె ఆచూకీ గుర్తించేందుకు చర్యలు చేపట్టారు. వృద్ధురాలు ఇచ్చిన ఆధారాలతో సమాచారాన్ని విశాఖలోని మల్కాపురం పోలీసులకు చేరవేశారు. అక్కడి పోలీసులు ఆమెను జ్ఞానాపురానికి చెందిన మెట్టిపల్లి సూర్యకుమారిగా గుర్తించి, కుటుంబసభ్యులకు తెలియజేశారు. దీంతో వృద్ధురాలి బంధువులు మణికంఠ, సూర్యనారాయణ, లక్ష్మిలు విజయనగరం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకోగా పోలీసులు వృద్ధురాలిని వృద్ధాశ్రమం నుంచి స్టేషన్‌కు తీసుకువచ్చి వారికి అప్పగించారు.

విరగ్గాసిన పనస చెట్టు



సాధారణంగా ఓ పనస చెట్టుకి 20 నుంచి వంద కాయలు కాయడం సహజం. బొబ్బిలి మండలం చిలకమ్మవలసలో ఓ ఇంటి ముందున్న పనస చెట్టు ఏకంగా 320కి పైగా కాయలతో చూసేవారిని ఆశ్చర్యచకితులను చేస్తోంది. ఏటా పనస చెట్టు అధిక దిగుబడినిస్తోందని యజమాని తాడిపల్లి తమ్మన్నదొర తెలిపాడు.

– బొబ్బిలి